# మాయమైన మొసలి పాము

## ఎమ్.వి.వి. సత్యనారాయణ

ఘాట్ రోడ్డు మీద కారు నున్నగా జారిపోతోంది.

శంకరరాజన్ స్టీరింగ్ వీల్ వద్ద కూర్చున్నాడు. విండ్ స్క్రీన్ లోంచి ముందుకు చూస్తూ వీల్ త్రిప్పు తున్నాడు. కుడిచేతిలో త్రిబుల్ ఫైవ్ సిగరెట్టు వెలుగుతోంది. గుండెల నిండుగా పొగ పీల్చుకున్నాడు. ఆలోచనల్లో ఉన్నాడు.

దక్షిణ భారత చిత్రపరిశ్రమలో తాను మకుటం వున్న మహారాజు. తన చిత్రం అంటే డిస్ట్రిబ్యూటర్ కళ్ళు మూసుకుని కొనుక్కుంటాడు. తన చిత్రం ఆంధ్రాలో విడుదలవుతోంటే మిగతా చిత్రాలవాళ్ళు కళ్ళు విచ్చుకు చూస్తారు. తనకంటే వాళ్ళకే మొదటి రోజు ప్రేక్షకుల మాట ముందుగా తెలుస్తుంది. చిత్రం ఫ్లాప్ అవుతుందేమోనని వాళ్ళ దురాశ!

చిత్ర నిర్మాణాలో తాను తీసుకునే జాగ్రత్తలు వాళ్ళకు తెలియకకాదు. వాళ్ళు వాంచి చిత్రం తీయలేక!

కో త్తదనాన్ని ఆహ్వానించలేక! తన చిత్రం అంటే పేరున్న తారలు కూడా కాళ్ళు తొక్కుకుని మరీ కాల్ షీట్స్ యిస్తారు.

ధనమూలం ఇదం జగత్.

తను పనిచేయించుకుంటున్న తన కళాకారులకెన్నడూ అన్యాయం చేయడు. అదే తన విజయానికి మూలసూత్రం.

శంకరరాజన్ కారు మలుపు త్రిప్పాడు.

ఇప్పుడు తాను ఒక చిత్రం తీయాలి. ఆంధ్రదేశం అట్టుడికి పోవాలి. కలెక్షన్స్ రికార్డులను బ్రద్దలుకొట్టాలి. తన చిత్రంలో అన్ని స్థాయిలలోని ప్రేక్షకులకు కావలసిన మసాలాలు కావలసిన మోతాదులో ఉంటాయి. ఇప్పుడు తాను తీయబోయే చిత్రం స్కోప్ చిత్రం. ప్యూజి కలర్‌లో తీయాలి. ముడి ఫిలిం సిద్ధంగా వుంది.

కథ సిద్ధంగా వుంది. పాత్రలకు చాలవరకూ తారలు ఎన్నికయారు. తన వాహిరా స్టూడియోలో సెట్స్ నిర్మిస్తున్నారు.

షూటింగ్ మొదలు పెట్టాలి. ఇప్పుడే చిన్న ఆటంకం వచ్చి పడేలాగా వుంది.

అసంకల్పితంగా ఆయన చేతులు బ్రేకులు మీద పడ్డాయి.

రోడ్డుకి ప్రక్కగా వాహిరా స్టూడియో.

వాచ్‌మాన్ నిలబడి తన కారునే చూస్తున్నాడు. కారుకు సలాంకొట్టి గేటు తెరిచాడు.

కారు గేటులోంచి లోపలకు వెళ్ళింది.

పోర్టికోలో ఆగింది. శంకరరాజన్ కారు దిగాడు. స్టూడియో మెయిన్ హాల్‌లో తారలూ, టెక్నిషియన్‌లు కూర్చుండి ఉన్నారు.

హాస్యనటుడు వాళ్ళకు కాలక్షేపం కలిగిస్తున్నాడు.

శంకరరాజన్‌ని చూడగానే వాళ్ళు నవ్వుతూ చూశారు.

శంకరరాజన్ ఆశ్చర్యంగా చూశాడు. "ఇంతమంది తారలు ఒకేసారి నా స్టూడియోలో కబురూ కాకరకాయ లేకుండా...." నవ్వాడు శంకరరాజన్.

ఆయన తీయబోయే వర్ణచిత్రంలోని హీరో గొంతు సవరించుకున్నాడు.

"ఆంధ్ర దేశంలో తుపాన్ భీభత్సం గురించి ఈ రోజు వార్తలలో వినేవుంటారు" అన్నాడు హీరో.

"అవును. కోస్తా ప్రాంతాలు బాగా దెబ్బతిన్నాయి. లక్షల ప్రజలకు ఆశ్రయం పోయిందిట!" అన్నాడు శంకరరాజన్.

హీరోతోబాటు మిగతా తారలు విచారంగా చూశారు.

"ఆంధ్రదేశంలోని ముఖ్య కేంద్రాలు సందర్శించాలనీ తుపాను బాధితులకు కొంత నిధిని పోగుచేయాలనీ మన వాళ్ళు నిర్ణయించుకుంటున్నారు."

"మంచిదే! మన చిత్రాలకు పోషకులు వాళ్ళే! వాళ్ళను ఇటువంటి సమయాల్లోనే ఆదుకోవాలి!"

"కాని మన స్కోవ్ చిత్రానికి ఈ నెలలో ఇక్కడ ఉన్నవాళ్ళంతా ఎప్పుడో ఒకప్పుడు కాల్ షీట్స యిచ్చినవాళ్ళే...."

"ఆంధ్ర దేశంలో ఎంతకాలం పర్యటించాలని...."

"పది రోజులు."

"ఆల్ రైట్....ఆ కాలంలోని కాల్ షీట్సు కాన్సిల్ చేసుకుందాం."

"చిత్ర నిర్మాణంలో మీకు ఇబ్బంది కలుగుతుంది."

"నా స్టూడియో.... నా చిత్రం.... నా తారలు....నష్ట పోయేదిలేదు. ఈ లోపుగా నేను కొన్ని సీన్స్ షూట్ చేసుకుంటాను."

"తారలు ఎవరూ ఉండరు."

శంకరరాజన్ నవ్వి, "చిత్ర పరిశ్రమ బయలుదేరి వెళ్లాలి....ప్రజలను ఆదుకోవాలి. నా విరాళం లక్ష రూపాయలు. కాని...." ఆగాడు.

"ధాంక్యూ సార్ ....కాని....సీన్స్ ఎలా షూట్ చేస్తారు?"

"తారలు కానివాళ్ళతో...."

"సస్పెన్సా?"

"కాదు. నగరంలోకి రష్యన్ సర్కస్ వచ్చింది. మన చిత్రంలోకి కొన్ని సీన్స్ షూట్ చేస్తాను."

తారలు చప్పట్లు కొట్టారు.

"మరో 'మేరానామ్ జోకర్....' తీస్తారన్నమాట!" అన్నాడు హాస్యనటుడు.

"కాదు. 'మేరానామ్ జోకర్' లాగా తీయను."

"సర్కస్ సీన్స్ ఎప్పటివరకూ షూట్ చేస్తారు?" అడిగాడు హీరో.

"మీ పర్యటనా కార్యక్రమాలు ముగిసేలోపున!"

"ఆల్ రైట్! ఇంతసేపూ కాల్ షీట్స్ రద్దయినందుకు అందరమూ బాధపడ్డాం. ఆ వ్యవధిలో చిత్ర నిర్మాణం కుంటుపడదు!"

శంకరరాజన్ తలూపి, "రష్యన్ సర్కస్ అధినేత ఇల్యనోవ్ మీలో ఎవరికి తెలుసు?" అన్నాడు.

హాస్యనటుడు లేచి మెల్లగా టెలిఫోన్ వున్న బల్లను

సమీపించాడు.

"ఆయన నాకు తెలుసు సార్! ఫోన్ చేద్దామా?" అన్నాడు.

"నీకు ఆయనతో పరిచయం ఎలా అయింది?" అడిగాడు శంకరరాజన్.

"సర్కస్ ఈ నగరానికి రాకముందు బెంగుళూరులో ఆడేది. హాస్యగాళ్ళకోసం ఆయన ఇంటర్వ్యూ పెట్టారు. నేనూ వెళ్ళాను. నేను ఎన్నిక కాలేదు" హాస్యనటుడు రిసీవర్ ఎత్తి నంబర్ డయిల్ చేశాడు.

హాస్య నటుడు తనని ఫోన్‌లో పరిచయం చేసుకున్నాడు.

ఫోన్ ఎత్తింది ఇల్యనోవ్.

హాస్య నటుడు రిసీవర్‌ని శంకరరాజన్‌కి అందించాడు.

"గుడ్ డే మిస్టర్ ఇల్యనోవ్! మీతో ఒక అర గంట మాట్లాడాలి. ఎప్పుడు రమ్మంటారు?"

"వెరీ గుడ్ డే.... నేనే మిమ్మల్ని కలవాలనుకుంటున్నాను" స్వచ్ఛమైన ఇంగ్లీషు. రష్యన్ యాస దానికి కోటింగ్ యిస్తోంది.

"ఎందుకోసమో చెబుతారా?"

"ఇండియాలో మా ట్రూపు కొత్త అంశాలు నేర్చుకుంది. వాటిని మీవంటి చెయ్యి తిరిగిన దర్శకులు షూట్ చేయించగలరు."

"ఆ ఫిలిం ఏం చేస్తారు?"

"మాస్కోలోని టి. వి. కేంద్రంలో ప్రసారం చేస్తారు!"

"అలాగే...తప్పకుండా షూట్ చేస్తాను. నా పని కూడా సులువవుతుంది!"

"మీ పనా? చెప్పండి!"

"నేనో పిక్చర్ స్కోప్‌లో తీస్తున్నాను. ఆ చిత్రం కోసం కొన్ని సర్కస్ ఫీట్స్ కావాలి!"

ఇల్యనోవ్ కిచకిచ నవ్వాడు. "సినిమా తీయడమే పెద్ద సర్కస్ ఫీట్!"

"నిజమే!" శంకరరాజన్ కూడా నవ్వాడు. "జీవితానికీ, సర్కస్ జీవితానికీ పోలికలున్నాయి. సర్కస్ ఫీట్స్‌ను సింబాలిక్‌గా చిత్రంలో వాడుకుంటాను."

"బాగుంటుంది. ప్రదర్శన జరిగేటప్పుడు షూట్ చేస్తారా? షూటింగ్‌కి ప్రత్యేక ప్రదర్శన యివ్వాలా?"

"నేను వేయించిన సెట్స్‌లోనో, ప్రకృతి మధ్యనో షూట్ చేయాలనుకుంటున్నాను."

"ఐసీ...సర్కస్ టెంట్ బాక్‌గ్రౌండుగా వుండదు!"

"కరెక్టు!"

"అయితే ఒక సర్దుబాటు. మీరు ప్రదర్శనలో షూట్ చేసిన సీన్స్ నాకూ, ప్రత్యేక ప్రదర్శనలో షూట్ చేసుకున్నవి మీకూ....ఓ....కె...."

"మీకు గుడ్‌విల్...."

"గుడ్‌విల్ ప్రసక్తిలేదు. నా సీన్స్‌కి నేను ఏమీ యివ్వను!"

"ఆల్‌రైట్...."

"ఎప్పుడు స్టార్టు చేస్తారు?"

"రేపు రాత్రి.... మొదటి ఆటలో...."

"గుడ్. మొదటి ఆట సాయంకాలం 6_30 కి ప్రారంభం."

"థాంక్యూ....మిగతా వివరాలు సమక్షంలో...."

శంకరరాజన్ ఫోన్ పెట్టేశాడు.

# 2

"టైం ఎంత?" అడిగాడు అతడు.

రెండోవాడు వాచీ చూసుకున్నాడు. "ఒంటిగంటా పది నిముషాలు!" అన్నాడు.

మొదటివాడు చుట్టూ చూశాడు. అర్థ రాత్రి చీకట్లు అక్కడక్కడా తారాడుతున్నాయి. వాటిని కూడా పారదోలడానికి నియోన్ లైట్లు వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాయి. ఇద్దరూ రోడ్డు వదిలిపెట్టి చీకట్లో నడవసాగారు.

"మనం ఆలస్యం చేశాం!" అన్నాడు మొదటివాడు.

"ఇప్పటికయినా మించిపోయింది లేదు" అన్నాడు రెండోవాడు.

ఇద్దరూ సందులోపడి నడుస్తున్నారు.

ఎక్కడో తీతువు అరుస్తోంది. ఉండిఉండీ రోడ్డు మీద ఏదో వాహనం వెళ్తోంది.

మొదటివాడు సందు చివరలో ఆగాడు.

రెండోవాడు తన భుజాన వున్న సంచి తడుముకున్నాడు. ముడులు వేసిన తాడు. దాని చివర కొక్కెం!

"మ్యూజియం కనిపిస్తోందా?"

"ఆఁ! అదిగో రోజ్‌లాండ్ హోటల్. రెండో అంతస్తులో వున్నదే మ్యూజియం."

"వాచ్‌మన్‌లు ఇద్దరా?"

"అవును. ఒకడు ఇటునుండి, రెండోవాడు అటునుండి హోటల్‌ను ప్రదక్షిణం చేస్తారు."

"ఇద్దరూ ఎక్కడ కలుసుకుంటారు?"

"హోటల్ మెయిన్ గేటు దగ్గర. అచ్చాగా వెనక ప్రక్క కూడా ఒక నిర్ణీత స్థలం దగ్గర."

"అయితే వెనక ప్రక్కకి చేరుకుందామా?"

"వద్దు ఇక్కడ అయితే నే_కిళ్ళీ కొట్లు అడ్డం ఉన్నాయి."

ఇద్దరూ హోటలువైపు చూశారు.

వాచ్‌మన్‌లు కలుసుకుని అప్పుడే విడిపోతున్నారు.

"వాళ్లు మరుగులోకి వెళ్ళగానే మనం కిళ్ళీ కొట్టు వెనక చేరుకోవాలి."

"రైట్!"

ఒక నిమిషం తర్వాత ఇద్దరూ కిళ్ళీ కొట్టు వెనుక చేరుకున్నారు. ఇప్పుడు వాళ్ళ చేతుల్లో చెరో కత్తి తళతళలాడుతోంది.

మొదటివాడు మెయిన్ గేటునుండి తాము నిలబడిన స్థలం అంచనా వేసుకున్నాడు.

"ముప్ఫయి అడుగులు .... మన ఇద్దరి కత్తులూ లక్ష్యాన్ని ఛేధించాలి."

"అవును."

క్షణాలు గడుస్తున్నాయి.

అటు వెళ్ళిన వాచ్‌మాన్ ఇటూ, ఇటు వెళ్ళిన వాచ్‌మాన్ అటూ వస్తున్నారు.

దాక్కున్న వాళ్లు కత్తులను పిడి దగ్గర పట్టుకున్నారు. కత్తులు దూసుకుపోవడానికి పొజిషన్‌లో ఉన్నాయి.

వాచ్‌మన్‌లు దగ్గరపడుతున్నారు.

ఇద్దరికీ మధ్య దూరం తగ్గుతోంది. ఇద్దరూ ఎదురెదురుగా ఆగారు. ఒకడు జేబులోంచి బీడీ తీశాడు. రెండోవాడు తన నోటిలోని బీడీతీసి అందించాడు.

కత్తులు గాల్లోకి లేచాయి. గాల్లో సర్‌మని శబ్దం చేశాయి.

మరుక్షణంలో ఇద్దరు వాచ్‌మన్‌లూ నేలకూలారు. ఒకడికి ఎడంప్రక్క ఛాతీలోకి, రెండోవాడికి కుడి ప్రక్క ఛాతీలోకీ కత్తులు దూసుకుపోయాయి.

చిన్న మూలుగు తప్ప, ఇద్దరూ ఎలాంటి శబ్దమూ చేయలేదు. క్షణంలో నేలకొరిగిపోయారు.

దాక్కున్న వాళ్ళిద్దరూ చుట్టూ చూసుకున్నారు.

తామిద్దరూ... అక్కడ నేలమీద రెండు శవాలూ... తప్ప నిర్మానుష్యం.

"మ్యూజియంలో ఎలక్ట్రికల్ అలారం!" రెండోవాడు గుసగుసలాడాడు.

మొదటివాడు తన జేబులోంచి పిస్తోలు తీశాడు. రెండో జేబులోంచి పొడవుపాటి వైర్ తీశాడు. పిస్తోలు గొట్టంలో వైర్ చివర వున్న బటన్‌ని ఫిట్ చేశాడు.

హోటల్‌కి ఇవతల ట్రాన్స్‌ఫార్మర్. హోటల్‌లోకి వెళ్తోన్న ఎలక్ట్రికల్ తీగెలను ఇద్దరూ గుర్తించారు. మొదటివాడు వాటికి తిన్నగా వెళ్ళి నిలబడ్డాడు.

తీగెతోబాటు పిస్తోలును పైకి గురిపెట్టాడు. ట్రిగ్గర్ నొక్కాడు. తీగె పైకి ఎగిరింది. చేపలాగా డైవ్ చేసింది. హోటల్‌కి వెళుతోన్న రెండు తీగెలమీద అడ్డంగా పడింది.

తీగెలలో మెరుపులు. మరుక్షణంలో హోటలులో కరెంటు ఫెయిలయింది.

"క్విక్!" అన్నాడు రెండోవాడు.

మొదటివాడు అతడివద్దనుండి త్రాడు తీసుకున్నాడు. రెండో అంతస్తుకి పిట్ట గోడ వుంది. పిట్టగోడ అంచుకు తగిలేలాగా త్రాడు విసిరాడు. కొక్కెం పట్టుపట్టింది.

ఇద్దరూ పిట్టగోడ మీదకు చేరుకున్నారు.

తాళాలు పగులగొట్టారు.

మొదటివాడు పెన్ టార్చి తీశాడు.

ఇద్దరూ మ్యూజియం లోపలకు నడిచారు.

ప్రాచీన కళాఖండాలూ, చిత్తరువులూ, నాణాలూ, పూర్వకాలం ప్రసిద్ధ వ్యక్తులు వాడిన వస్తుసముదాయమూ లేఖలూ గాజు అద్దాల షో కేసులలో అమర్చారు.

ఇద్దరూ లోపలి గదుల్లోకి నడిచారు.

ఖరీదయిన రాళ్ళూ, నగలూ, కలాలూ ఉన్నాయి.

"నార్త స్టార్ ఎక్కడ?" అడిగాడు మొదటివాడు.

"ఇక్కడే షో కేసులో చూశాను" రెండోవాడు వెదుకుతున్నాడు. చీకట్లో యిద్దరూ చెమటలు కక్కుతున్నారు.

పావుగంట ప్రయత్నం తర్వాత నార్త స్టార్ వజ్రం దొరికింది.

"ఇది నిజంగా ఆరు లక్షల రూపాయిల విలువ చేస్తుందా?"

"ఏమో! మన బాస్ మనకి ఆ సొమ్ము ఇస్తాడు. చాలదా?"

"ఇంత విలువైన వజ్రాన్ని ఇంత తక్కువ రక్షణ ఏర్పాట్లలో వుంచారా?"

"ఎక్కువ కట్టుదిట్టాలయితే లేనిపోని ప్రచారం అవుతుందనేమో!"

ఇద్దరూ నార్త స్టార్‌తో క్రిందకు దిగారు.

వాచ్‌మన్‌లు అలాగే పడివున్నారు.

"హైలాండ్ హోటల్ పాడుపడి ఉండటం మన అదృష్టం!"

"అవును."

ఇద్దరూ శవాల మీదుగా వొంగి కత్తులు లాక్కు న్నారు. శవాల యూనిఫారాలకు వాటిని తుడిచారు.

నడుస్తూనే డ్రయినేజీ హోల్ లోకి వాటిని విసి రేశారు.

చీకట్లోపడి నడుస్తోన్నారు.

రోడ్డుమీద కారు హెడ్ లైట్ల కాంతి పడుతోంది.

ఇద్దరూ పరుగెత్తారు.

రోజ్ లాండ్ ముందు ఒక టాక్సీ ఆగింది.

**3**

ఇల్యనోవ్ ప్రక్కమీద యిటు వో తిరిగాడు.

టెలిఫోన్ గణగణలాడుతోంది. ఇల్యనోవ్ చెయ్యి చాపి రిసీవర్ అందుకున్నాడు.

"ఇటీజ్ గ్రేట్ రష్యన్ సర్కస్!" అన్నాడు ఇల్యనోవ్.

"గుడ్ మార్నింగ్ మిస్టర్ ఇల్యనోవ్! శంకరరాజన్ ని మాట్లాడుతోన్నాను."

"గుడ్ మార్నింగ్!"

"నిన్న మనం షూట్ చేసిన సీన్స్ బాగా వచ్చాయి."

"థాంక్యూ!"

"క్రీడాకారిణుల మొహాలు క్లోజప్ లో తీయాలి. మధ్యలో ఎడిట్ చేసి వాటిని పాచ్ వర్క్ చేయాలి!"

"రైట్! ఎప్పుడు అరేంజ్ చేయాలి?"

"ఇప్పుడే! టెంట్ బ్యాక్ గ్రౌండ్ లోనే!"

"ఒక గంటలో వాళ్ళు సిద్ధమవుతారు."

"థాంక్యూ!" అవతల క్లిక్ మన్నది.

ఇల్యనోవ్ రిసీవర్ ను క్రెడిల్ చేశాడు.

సర్వెంట్ మెయిడ్ గు డా ర ం లో కి పరుగెత్తుకు

వచ్చింది.

మెయిడ్ వైపు ప్రశ్నార్థకంగా చూశాడు ఇల్యనోవ్.

"అమ్మగారు గొడవ పెడుతున్నారు! తమరిని రమ్మని!" అంది ఆమె.

"ఏం? ఎందుకు?" అడిగాడు ఇల్యనోవ్.

"స్వీటీని ఎవరో దొంగిలించారు!"

"స్వీటీనా? పామునా? ముసలి పామునా? ఎందుకు?"

"ఏమో, నాకు ఏం తెలుస్తుంది? హెలీనా అమ్మగారు చాల గొడవ పెడుతున్నారు. టెంటు పీకి పందిరి వేస్తున్నారు!"

నైట్ గౌను సర్దుకుంటూ ఇల్యనోవ్ బయటకు నడిచాడు.

హెలీనా టెంటులో గందరగోళంగా వుంది. హెలీనా పాముల తొట్టెవద్ద నిలబడి వుంది. ఆమె తమ్ముడు ఫెర్డినాండ్ తో బాటు ఇతర క్రీడాకారులూ, క్రీడాకారిణులూ తొట్టె చుట్టూ మూగారు.

ఇల్యనోవ్ వాళ్ళను తప్పించుకుంటూ తొట్టెవద్దకు చేరుకున్నాడు.

గాజు తొట్టె ఒక ప్రక్క పగిలివుంది. స్వీటీ తప్ప మిగతా పాములున్నాయి.

మట్టి నేలమీద జోడు ముద్రలు వున్నాయి. వాటిని ఎవరూ తొక్కకుండా ఫెర్డినాండ్ శ్రద్ధ తీసుకుంటున్నాడు.

"జాఫర్!" పిలిచాడు ఇల్యనోవ్.

జాఫర్ ముందుకు వచ్చాడు.

"కెమెరా తీసుకురా. ఈ జోడు ముద్రలు ఫోటో

తీద్దాం!" అన్నాడు ఫెర్డినాండ్.

జాఫర్ వురుకులు పరుగులమీద వెళ్ళిపోయాడు.

హెలీనా కళ్ళు ఎర్రగా వున్నాయి. బుగ్గలమీద కన్నీటి చారికలు! ఏడ్చి ఏడ్చి శ్వాస అందక రొప్పుతోంది.

"హెలీనా! ప్లీజ్ .... ఏడవక!" అన్నాడు ఇల్యనోవ్.

హెలీనా అతడి చేతిని విసిరికొట్టింది.

"ఇదంతా నీ పనే!" అరచింది హెలీనా.

"నా పనా?" తెల్లబోయాడు ఇల్యనోవ్.

"ఆ జోడు ముద్రలు చూడు! అవి నీ స్లిప్పర్స్‌వే!"

"నాన్సెన్స్! పామును నేనేం చేసుకుంటాను."

"చంపి ఎక్కడో పారవేసివుంటావు!"

"ఎందుకు?"

"సర్కస్‌లో వస్తోన్న లాభాలు నా పాములు తింటోన్నాయని!"

"మరి మిగత పాములు...."

"నా స్వీటీ పోయాక వాటిని నేనే వదిలిపెడతానని నీ నమ్మకం!"

"హెలీనా! నీకు మతిపోయింది!"

"అవును. మతిపోయింది. కాబట్టే నీ వెంటపడి వచ్చాను!"

"నీకు కావలసింది ఏడుప్! చేస్తాను. నన్ను అపరాధిగా చిత్రించితే నీకు ప్రయోజనం ఏమిటి?"

హెలీనా ఏడుపు ఆపింది.

"నా ట్రూపుముందు నన్ను ఫూల్‌ని చేయక! చర్మం వొలుస్తాను. తెలుసా?"

"మరి నీ జోడు ముద్ర ఎలా వచ్చింది?"

"నా జోళ్ళు వేసుకుని ఎవరో పామును దొంగి లించారు!"

"నా పాముతో వాళ్ళకేం పని?"

"మనిద్దరి సాన్నిహిత్యం పాడుచేయాలని!"

"అందువల్ల ఎవరికి లాభం?"

"ఆ విషయం తెలుసుకుందాం!"

హెలీనా కుతుటపడింది.

"గుడ్లు పెట్టే ప్లాస్టిక్ బుట్ట కూడా మాయమయింది!" అంది హెలీనా.

ఇల్యానోవ్ కళ్ళు మెరిశాయి. "అంటే పామును చంపరు!"

"స్వీటీ....నీవు ఎన్ని కష్టాలు?" హెలీనా తిరిగి ఏడ వడం మొదలుపెట్టింది.

జాఫర్ లోపలకు పరుగెత్తుకు వచ్చాడు. అతడి భుజాన కెమెరా వ్రేలాడుతోంది.

"మన కల్నల్ ది హాండ్ స్టిక్ పోయిందట సార్!" అన్నాడు జాఫర్.

హెలీనా కెవ్వుమన్నది. "హాండ్ స్టిక్ ఒక చివర J (జె)లాగా ఉంటుందికదా! దానితోనే నా స్వీటీని."

"గుడ్....నా జోళ్ళు వేసుకున్నారు. కల్నల్ గాడి స్టిక్ తో పామును ఒడిసిపట్టుకున్నారు. చిత్రం!"

టెంటులోకి గుసగుసలాడుతూ కల్నల్ వచ్చాడు.

కల్నల్ మూడు అడుగులకంటె ఎత్తు వుండడు. నలభై ఏళ్ళ వయసు. దాగని వయసు అతడి శరీరం మీద ముడతల్లో ప్రత్యక్షమవుతోంది. కండరాలూ ఎముకలూ సంకోచించినట్లూ, స్థలంలేక పైకి ఉబికినట్లూ అక్క డక్కడా బుడిపెలూ....బండ పెదిమలూ.గుబురు జుత్తూ.

"ఇల్యనోవ్ సాబ్! నా స్టిక్....అదృష్టవంతమైన స్టిక్ పోయింది. ఎవడో దుర్మార్గుడు నా అదృష్టాన్ని నాశనం చేయాలని...." వెక్కుతున్నాడు కల్నల్.

"పోతేపోనిద్దూ .... వెధవ స్టిక్ .... మరొకటి కొని ఇస్తానులే" అన్నాడు ఇల్యనోవ్.

"ఆఁ! వెధవ స్టిక్! నేను మీ సర్కస్‌లోకి రావడానికి అదే కారణం! ఇంతకాలమూ నాకు కాలం సౌఖ్యవంతంగా గడుస్తోందంటే ఆ స్టిక్ వల్లనే అని చెప్పుకోవాలి!"

"హాలీనాది అపురూపమైన పాము, నీ స్టిక్ ఎలా మాయమయిందో పరిశోధించమని ఎవరైనా నియోగిస్తాను!" అన్నాడు ఇల్యనోవ్.

"పాముకోసం, కర్రకోసం పరిశోధనా?" అన్నాడు జాఫర్.

కల్నల్ అతడిని కోపంగా చూశాడు.

"జాఫర్! శంకరరాజన్ గారి స్టూడియోకి వెళ్దాం పద! ఇంట్లో గోల! మనశ్శాంతి ఉండదు."

జాఫర్ తలాడించాడు.

జీపు బయలుదేరతీశాడు.

టి.నగర్ లో పార్కు ఎదుట బంగళాముందు ఆగింది జీపు.

ఇల్యనోవ్ జీపు దిగాడు. జాఫర్ జీపులోనే ఉండిపోయాడు. ఇల్యనోవ్ బంగళాలోకి నడిచాడు.

శంకరరాజన్ బయలుదేరే మూడ్‌లో వున్నాడు.

ఇల్యనోవ్ అతడికి విషయం విడమరచి చెప్పాడు.

శంకరరాజన్ ఆశ్చర్యపోయాడు. "దొంగ మీ స్లిప్పర్స్‌లో బయలుదేరాడు. కల్నల్ కి సంబంధించిన

కత్రతో పామును లాగాడు. గ్రుడ్లు పెట్టుకునే ప్లాస్టిక్ బుట్టముందు.... ఈ సంగతి చెప్పండి. బుట్టలో గ్రుడ్లు ఉన్నాయా?"

"ఆఁ! బుట్ట యెప్పుడూ ఉడకబెట్టిన గ్రుడ్లతో ఉంటుంది."

"ఎన్ని గ్రుడ్లు ఉంటాయి సాధారణంగా?"

"పదిహేనూ—ఇరవై...."

"రైట్....ఇప్పుడు మీ ఉద్దేశ్యం ఏమిటి?"

"పోలీస్ రిపోర్టు యిస్తే యెలా ఉంటుంది?"

"లేనిపోని రభస!"

"అయితే మీకు తెలిసిన ప్రయివేట్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ ఉంటే చెప్పండి."

"మీ దేశంలోలాగా ఇక్కడ ఏజన్సీలుండవు. వృత్తి పరంగా కొంతమంది డిటెక్టివ్ లుంటారు."

"పోనీ....వాళ్ళలో మీకు తెలిసిన డిటెక్టివ్ యెవరయినా సరే!"

శంకరరాజన్ తలూపి, విశాఖపట్నం ట్రంకాల్ బుక్ చేశాడు.

## 4

హోటల్ నయాగరా.

ప్లిమత్ కారు హోటల్ ముందు ఆగింది. కారులోంచి డిటెక్టివ్ శరీష్ దిగాడు. కారులో వున్న స్నేహితుడికి వీడ్కోలు చెప్పాడు. బూట్లు టకటకలాడించుకుంటూ హోటల్ ఆవరణలోకి నడిచాడు.

కౌంటర్ ముందు ఆగాడు.

"రూం నెంబర్ 30 కి మెసేజ్ ఉందా?" అడిగాడు శరీష్.

కౌంటర్ లోని వ్యక్తి కవర్ అందించాడు.

శంకరరాజన్ పంపిన కవర్. మెయిన్ హాలులో కూర్చుండి కవర్ విప్పాడు శిరీష్. రోజ్ కలర్ కాగితం బయట పడింది.

"మిస్టర్ శిరీష్,

నమస్తే. మీ కోసం వైజాగ్ ట్రంక్ కాల్ చేశాను. మీరు నయాగారా 30లో ఉన్నట్టు సునీత చెప్పారు. రూంకి వచ్చాను. మీరు లేరు. మీరు త్వరగా "గ్రేట్ రష్యన్ సర్కస్" గుడారానికి రావలసింది.

కృతజ్ఞతలతో
—శంకరరాజన్"

డిటెక్టివ్ శిరీష్ హోటల్ లోంచి బయటకు నడిచాడు. ఖాళీ టాక్సీ మాట్లాడుకున్నాడు.

అరగంటలో సర్కస్ గుడారంలో వున్నాడు. ఇల్యనోవ్ గుడారంలో శంకరరాజన్ దొరికాడు. శిరీష్కి సర్కస్ మనుషులు పరిచయమయారు.

"ఇల్యనోవ్ గారూ! శిరీష్ గారికి విషయం చెప్పండి!" అన్నాడు శంకరరాజన్.

ఇల్యనోవ్ దొంగతనాల గురించి చెప్పాడు.

"చివరగా తెలిసిన దొంగతనం నాకు సంబంధించినదే।"

"ఏమిటది?"

"పొగాకు పీల్చుకునే పైపు. పూర్తిగా దంతంతో చేసింది!"

"పైపు పోయినట్టు ఎప్పుడు తెలిసింది?"

"శంకరరాజన్ గారితో విషయం చెప్పాలని వెళ్లాను.

ఇద్దరమూ కలిసి హోటల్ నయాగరాకి వచ్చాం. అక్కడ మీరు లేరు.... టెంటుకి వచ్చాం. బయటనుండి రాగానే నాకు పైపు పీల్చడం అలవాటు! పైపు పోయినట్లు నిర్ధారణ అయింది.''

శరీఫ్ కళ్ళు మూసుకున్నాడు.

''ఈ దొంగతనాలలో ఒకదానికి మరోదానికీ పోలిక గానీ సంబంధంగానీ లేదు!''

ఇల్యనోవ్ దగ్గాడు. ''కల్నల్‌కి సంబంధించిన స్టిక్‌తో పామును దొంగిలించి ఉండాలి'' అన్నాడు.

''అది కేవలం మన వూహ. మరేరకంగా అయినా పాములను దొంగిలించవచ్చును. మిగతా దొంగతనాల్లాగా స్టిక్‌ను కూడా దొంగిలించారు.''

ఉన్నట్టుండి జాఫర్ కెవ్వుమన్నాడు.

''నా జేబురుమాలు!'' అరిచాడు జాఫర్.

''జేబు రుమాలా? అదీ పోయిందా!'' అన్నాడు ఇల్యనోవ్.

''అవును సార్! అది ఎప్పుడూ నా జేబులోనే వుంటుంది. ప్రదర్శన సమయంలో వ్రేలికి తగిలించు కుంటాను. అద్దాల జేబురుమాలు.''

శరీఫ్ కళ్ళు విచిత్రంగా మెరిశాయి.

''శరీఫ్‌గారూ!'' ఇల్యనోవ్ కంఠం పూడుకుపోయింది.

''నా ఆర్టిస్టులను మానసికంగా క్రుంగదీయాలని ఎవరో ఈ దొంగతనాలు చేశారు. నా సర్కస్ ట్రూపు ప్రపంచ వ్యాప్తంగా పేరు పొందినది. ఇలా యెన్నడూ యెక్కడా జరగలేదు'' అన్నాడు ఇల్యనోవ్.

''ఈ దొంగతనాలు చేసింది పై వ్యక్తి కాదు. మీ ట్రూపులోని వ్యక్తే!'' అన్నాడు శరీఫ్.

"అయినా సరే నేను శిక్షించక వదలను."

"నా జేబురుమాలు! అచ్చివచ్చిన జేబురుమాలు!" అన్నాడు జాఫర్.

అతడి గొంతు ఏడవడానికి సిద్ధంగా వుంది.

## 5

క్రైంబ్రాంచ్ ఇన్స్పెక్టర్ బాలన్ తలెత్తి చూశాడు.

డిటెక్టివ్ శిరీష్ తన చేతిలో ఉన్న ఫోటోలను తదేకంగా చూస్తోన్నాడు.

మొదటి ఫోటోలో నేలమీద ఇద్దరి శవాలు పడి వున్నాయి. రెండో ఫోటోలో ఒక్కడి శవమూ, మూడో ఫోటోలో రెండో శవమూ క్లోజప్ లో ఉన్నాయి. గాయాలు స్పష్టంగా ఉన్నాయి.

"నారు స్టార్ వజ్రం ఏ మాత్రం విలువచేస్తుంది?" అడిగాడు శిరీష్.

"ముడివజ్రం. దాన్ని సానబెడితే కాని విలువ తెలియదు" అన్నాడు బాలన్.

"ముడివజ్రం విలువ ఏ మాత్రం వుండవచ్చును?"

"నాలుగు లక్షల రూపాయిలలోపు."

"ఇంకేం! విలువయిన వజ్రమే! సానబెట్టాక యెనిమిది లక్షలకు పైగానే విలువచేస్తుంది!"

"కావచ్చును. వజ్రాన్ని దొంగిలించినవాళ్లు నేర్పరులు. యెలక్ట్రికల్ అలారం మ్రోగకుండా చేశారు. లాఘవంగా మేడ యెక్కారు. చేతులకు గ్లోవ్స్ వాడారు."

"శవాలను మొదటిసారిగా యెవరు చూశారు?"

"టాక్సీ డ్రయివర్. ఖాళీగా వెళుతోన్న టాక్సీలో వచ్చాడు. శవాలను చూచి దగ్గరలో వున్న పోలీస్

స్టేషన్‌లో రిపోర్టు చేశాడు."

"హత్యలకు ఉపయోగించిన ఆయుధంగానీ, ఆయుధాలుగానీ దొరికాయా?"

"లేదు."

"పోస్టుమార్టం రిపోర్టు ఏమిటి?"

"ఒకడికి రిబ్స్ కట్ అయి ఊపిరితిత్తి తెగింది. రెండోవాడికి రిబ్స్ కట్ అయి సరాసరి గుండె గాయపడింది. చాల నేర్పుగా ఆయుధాలు ప్రయోగించారు."

"నేర్పుగా.... అంటే."

"రిబ్స్ ప్రాంతంలో ఆయుధాలు తగిలి ప్రాణాలు పోవడం అరుదు. ప్రక్క యెముకలు చాలవరకు గుండెనూ ఊపిరితిత్తులనూ దెబ్బలనుండి రక్షిస్తాయి. పదునైన ఆయుధాలు! వాడిన వ్యక్తులు బలిష్ఠులయి వుండాలి. వాళ్ళ చేతుల్లో అంతులేని నేర్పు!"

శిరీష్ మెదడులో ఏదో దీపం మిణుకు మిణుకుమంటోంది.

"టాక్సీ డ్రయివర్‌ను పిలుస్తారా?"

"వై నాట్? పోలీస్ కమీషనర్ మీకు ఈ కేసు ఒప్పచెప్పారు. మీకు అన్నిరకాలా సహకారం ఇవ్వడం నా బాధ్యత!" బాలన్ వెనక్కి వాలాడు. యెవరికో ఫోన్ చేశాడు.

అరగంటలో టాక్సీ డ్రయివర్ వచ్చాడు.

"శవాలను చూడగానే ఏం చేశావు?" అడిగాడు శిరీష్.

"భయపడలేదు సార్! నగరంలో ఏదో మూల ఏదో హత్యో మానభంగమో జరిగినట్టు రోజూ వింటున్నాను. పోలీసులకు తెలియపర్చాను" అన్నాడు టాక్సీ డ్రయివర్.

"ఆ సమయంలో రోజ్ లాండ్ హోటల్ ప్రాంతాల్లో యెవరినయినా చూశావా?"

"నా టాక్సీ ఆగకముందు హెడ్ లైట్స్ కాంతిలో యెవరో ఇద్దరు కనిపించారు సార్! మరుక్షణంలో వాళ్లు సందులోకి మాయమయారు."

"వాళ్ళకీ హత్యలకీ సంబంధం ఉన్నట్లు నీకు తోచిందా?"

"చెప్పలేను సార్!"

"ఏం?"

"నా టాక్సీ ఆ ప్రాంతాలకు వచ్చేసరికి ఒకటీ ముప్ఫయి దాటుతోంది. ఆ రోడ్డులో మూడు సినిమా హాళ్లున్నాయి. తమిళం పిక్చర్లు వదలిపెట్టే వేళ! హత్యాలూ దొంగతనాలూ చేసేవాడు ఆ సమయం వరకూ కాచుకోడు."

"వాళ్ళను నువ్వు స్పష్టంగా చూడలేదు కదూ!"

"అవున్సార్! వెనకనుండి చూశాను. అదీ కొన్ని క్షణాలపాటే!"

"వాళ్ళు ఏ సందులోకి మాయమయారు?"

"హోటల్ కి యెదుటి సందు!"

"మనం ఇద్దరమూ వెళ్దాం. చూపిస్తావా?"

"తప్పకుండా సార్!"

బాలన్ వద్ద సెలవు తీసుకుని ఇద్దరూ బయలుదేరారు. రోజ్ లాండ్ హోటల్ ముందు పోలీసు బందోబస్తువుంది.

మ్యూజియంను తాత్కాలికంగా మూసివేశారు.

మున్సిపల్ కార్పొరేషన్ వారి సహకారంతో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన మ్యూజియం కావడంతో పెద్ద యిబ్బంది కలగలేదు.

సందు మొదట్లో టాక్సీ ఆపాడు డ్రయివర్.

సందులో టాక్సీ వెళ్ళదు. సందుకి అటూ ఇటూ వున్న ఇళ్ళ గోడలు! పెద్దగా ఉపయోగంలేని సందు కావడంతో చెత్తాచెదారం పడివుంది.

డ్రయివరూ, శిరీష్ సందులో నడవసాగారు.

శిరీష్ ప్రక్కలకూ క్రిందకూ చూడసాగాడు. ఇద్దరూ సందుచివరకు వచ్చారు.

శిరీష్ కళ్ళు నేలమీద అతుక్కుపోయాయి.

నేలమీద అంటుకుపోయిన గుడ్డముక్క. దానిమీద చింతపిక్క రంగు చుక్కలు మూడు.

శిరీష్ వొంగి చూశాడు. సందేహంలేదు. అవి రక్తం చుక్కలు. గుడ్డముక్కను పదిలంగా కట్ చేశాడు శిరీష్.

దారి ప్రక్కగా దొరికిన సిగరెట్ పెట్టెలో గుడ్డ ముక్కను పదిలపరిచాడు.

ఇద్దరూ నడవసాగారు.

రోడ్డుకి అటూయిటూ నియోన్ లైట్ల స్తంభాలు.

శిరీష్ దూరంగా చూసి వులిక్కిపడ్డాడు.

చారల చారల సర్కస్ టెంట్!

"టాక్సీని అటు రోడ్లోంచి నడిపించు. నే నా సర్కస్ గుడారంలో ఉంటాను" అన్నాడు శిరీష్.

డ్రయివర్ తలూపి తిరిగి సందులోకి తిరిగాడు.

శిరీష్ రోడ్డుమీద నడిచి సర్కస్ గ్రౌండ్‌లోకి దిగాడు.

గుడారంలో ప్రవేశిస్తూ వాచీ చూసుకున్నాడు.

ఉదయం పదిగంటలు.

రింగులో కొంతమంది ఆర్టిస్టులు ప్రాక్టీసు చేసుకుంటున్నారు. మూడు సీసాలమీద నాలుగు కాళ్ళ

స్టూలు నిలబెట్టారు. పదేళ్ళమ్మాయి స్టూలుమీద నిలబడింది. ఆ అమ్మాయి చేతిలో పొడవుపాటి కర్రరాట వున్నది. ఆ రాట చివర అయిదేళ్ళ అబ్బాయి విలాసంగా కూర్చున్నాడు.

స్టూలుకి అవతలగా అజయ్ నిలబడి వున్నాడు. అతడి భుజంమీద ఆరడుగుల హెండాలియం సిలిండర్ వుంది. దాని చివర అజయ్ తలక్రిందులుగా వ్రేలాడి విన్యాసాలు చేస్తున్నాడు. బాలెన్స్ తప్పకుండా విన్యాసాలకు అనుగుణంగా అజయ్ నేలమీద అడుగులు వేస్తున్నాడు.

జాఫర్ వాళ్ళ ఫీట్సును పరిశీలిస్తూ అటూ యిటూ కదులుతోన్నాడు.

శరీఫ్ రింగును సమీపించాడు.

అజయ్ పైకి చూస్తున్నాడు. విజయ్ తలక్రిందులుగా వున్న వాడల్లా నిటారుగా కదిలాడు.

సిలిండర్ బాలెన్స్ తప్పింది.

'దడ్ డ్....' సిలిండర్ ప్రక్కవాటుగా కార్పెట్ మీద పడింది. విజయ్ గావుకేక పెట్టి సిలిండర్ మీద పడ్డాడు.

అజయ్ తేరుకున్నాడు. చటుక్కున వొంగి విజయ్‌ను లేవదీశాడు.

ఇద్దరూ సిలిండర్‌ను మోసుకుంటూ లోపలకు వెళ్ళిపోయారు.

శరీఫ్ కదిలాడు.

డ్రయివర్ గుడారం లోపలకు వచ్చాడు.

ఇద్దరూ కలసి ఇల్యనోవ్ గుడారం వైపు నడిచారు.

ఇల్యనోవ్ తలపట్టుకు కూర్చున్నాడు.

శరీఫ్‌ను చూడగానే తేరుకున్నవాడల్లే చూశాడు.

"శిరీష్‌గారూ! ఈ దొంగతనాలకు అంతం లేకపోతే నేను కొత్త ఆఫీసులను తర్ఫీదు ఇచ్చి చేర్చుకోవలసిందే!" అన్నాడు ఇల్యానోవ్.

శిరీష్ తాను ఓ కుర్చీలో కూర్చుంటూ డ్రయివర్‌కి సీటు చూపించాడు.

"కొత్తగా దొంగతనాలు ఏం జరిగాయి?" అడిగాడు శిరీష్.

"ఫ్రిడ్జ్ నాండ్‌ది 'వైట్ హార్స్ విస్కీ' పోయింది" ఇల్యానోవ్ మొహంలో చెమటలు.

శిరీష్ నవ్వబోయి ఆగాడు.

"ఎత్తుకుపోయిన కోడిగ్రుడ్లు విస్కీలో నంజుకున్నారేమో!"

"ప్లీజ్ .... టేకిట్ సీరియస్ .... ఆ గ్రుడ్లు స్వీటీ కోసం అని హెలీనా సరిపెట్టుకుంటోంది."

శిరీష్ మెల్లగా నవ్వాడు.

"మీకు ప్రత్యర్థి సర్కస్ బృందం ఏదయినా వుందా?" అడిగాడు శిరీష్.

"వుంది. కాని ఆ బృందం తాలూకు వాళ్ళంతా కెనడాలో పర్యటిస్తున్నారు."

"మీ బృందంలో వున్న వాళ్ళలో ఎవరయినా ఆ బృందం తాలూకు వాళ్ళు వున్నారేమో!"

"లేరండీ. అందరినీ ఎంచే తీసుకున్నాము!"

టెలిఫోన్ గణగణలాడింది.

ఇల్యానోవ్ రిసీవర్ అందుకున్నాడు.

టెలిఫోన్‌లో వినిపిస్తోంది విని ఇల్యానోవ్ మొహంలో రంగులు మారసాగాయి.

# 6

శంకరరాజన్ కెమెరా ముసుగులోంచి ఇవతలకు వచ్చాడు. కెమెరా ముందుకు చూశాడు.

అటూ యిటూ రాడ్స్ పాతి మధ్యలో వైర్ కట్టాడు. ఫరీదున్నీసా వైర్ కింద నిలబడింది. ఆమె భర్త కృపారావు అటుప్రక్క నిలబడి ఏర్పాట్లు పరిశీలించసాగాడు.

ఫరీదున్నీసాను సమీపించాడు శంకరరాజన్.

తాను షూట్ చేయబోయే దృశ్యాన్ని ఆమెకు వివరించసాగాడు శంకరరాజన్. ఆమె తనకు తెలియని విషయాన్ని మరల మరల అడిగి తెలుసుకుంటోంది.

"రెడీ...." అడిగాడు శంకరరాజన్.

"క్లోజప్ షాట్స్ తరువాత తీస్తారా?" అడిగాడు కృపారావు.

"ఫరీద్ సరైన మూడ్‌లో లేదు. క్లోజప్‌లో తర్వాత తీస్తాను."

కృపారావు భార్యవైపు చూశాడు.

ఫరీద్ మొహంలో కళ తగ్గివుంది.

"అలా వున్నావేం?" అడిగాడు కృపారావు.

ఫరీద్ మాట్లాడకుండా నిచ్చెన ఎక్కింది. తీగకు ఇవతలగా వున్న చెక్కమీద నిలబడింది. కృపారావు ఆమెకు చిన్న గొడుగు అందించాడు.

"తీగ మధ్యకు వెళ్ళాక గొడుగు విప్పు!" అన్నాడు శంకరరాజన్.

ఫరీద్ తలూపింది.

శంకరరాజన్ తన అసిస్టెంట్ వైపు చూశాడు. అసిస్టెంటు కెమెరాను సమీపించాడు. వ్యూఫైండర్‌లోంచి

ఫరీద్‌ను చూశాడు.

తల పైకెత్తాడు. తృప్తిగా చూశాడు.

శంకరరాజన్ కదిలాడు. వ్యూఫైండర్‌లోంచి చూశాడు.

అసిస్టెంట్ క్లాప్ కొట్టాడు.

"రెడీ!" అరిచాడు శంకరరాజన్.

ఫరీద్ తీగెలమీద నడవసాగింది. ఆమె చేతిలో గొడుగు వ్రేలాడుతోంది.

తీగ మధ్యకు వెళ్ళింది ఫరీద్.

గొడుగును పైకెత్తి బటన్ నొక్కింది. గొడుగు పర్ మంటూ వెనక్కి విరుచుకుపోయింది.

ఫరీద్ వణికింది. గొడుగు విరుచుకుపోయిన వూపులో బాలన్సు తప్పింది. కెవ్వున అరచి క్రిందకు పడిపోయింది.

శంకరరాజన్, కృపారావూ, అసిస్టెంటూ ఆమె వద్దకు పరుగెత్తారు.

ఫరీద్‌కి స్పృహ తప్పింది.

శంకరరాజన్ వెంటనే డాక్టర్‌కీ, పనిలో పనిగా ఇల్యనోవ్‌కీ ఫోన్ చేశాడు.

డాక్టర్ పరిచర్యలయాక ఫరీద్‌కి స్పృహ వచ్చింది.

ఇల్యనోవ్ తనవెంట డిటెక్టివ్ శిరీష్‌ను తీసుకువచ్చాడు.

"గొడుగును ఎవరు పాడుచేశారు?" అడిగాడు శిరీష్.

"తెలియదు" అంది ఫరీద్.

"అసలు ఉదయంనుండీ ఈమె మొహంలో 'మూడ్' లేదు" అన్నాడు శంకరరాజన్.

ఫరీద్ పేలవంగా నవ్వింది.

"రెండువందల రూపాయలున్న మనీపర్సు పోయింది" అంది ఫరీద్.

"రెండువందల రూపాయలా? ఎవరు తీశారు?"

"ఏమో! తీసుకున్నవాళ్ళు పర్స్—వట్టి పర్స్ ఇచ్చినా చాలును!"

"పర్స్ సీవ అచ్చి వచ్చిందా?" శరీఫ్ చురుకుగా చూశాడు.

"అవును."

"ఏం పర్స్ అది?"

"పాము చర్మంతో చేసింది! నాకు మా మదర్ చచ్చిపోతూ యిచ్చిన పర్స్ అది!"

శరీఫ్ పెదిమలు బిగించాడు.

దొంగిలించిన వారికి తాము దొంగిలించిన వస్తువులు విలువైనవి కావు. కాని పోగొట్టుకున్న వాళ్ళకి మాత్రం అవి అపురూపం! అయినా వస్తువులు పోయినంతమాత్రాన వాళ్ళు తమ ప్రదర్శనలో భంగపడటం ఏమిటి? ఆర్టిస్టులు నటిస్తున్నారా? అయితే వాళ్ళలో బాటే వున్న దొంగ(లూ) నటిస్తున్నట్టనుకోవాలా?

ఈ చిన్న దొంగతనాలవలన లాభం ఏమిటి?

శరీఫ్ మెదడులో చురుక్కుమంది. ఈ అప్రధానమైన దొంగతనాల మధ్య ఏదో ముఖ్యమైన దొంగతనం వుంది.

నారుస్టార్!

ఇన్స్పెక్టర్ బాలన్ మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

ఆయుధాలను లాఘవంగా వుపయోగించి వాచ్ మన్ లను హత్యచేశారు.

శరీఫ్ వులిక్కిపడ్డాడు.

సర్కస్ లో కత్తులు విసిరేవాడు ఈ నేరంలో వున్నాడేమో....

ఇల్యానోవ్ వైపు సాభిప్రాయంగా చూశాడు.

"మీ సర్కస్‌లో కత్తులు విసిరే ఫీటు వుందా?" అడిగాడు శిరీష్.

"లేదు."

"ఏం."

"అతడు ఒక ప్రమాదంలో చనిపోయాడు. అటు తర్వాత నాకు తగిన ఆర్టిస్టు దొరకలేదు."

"అతడు వాడిన కత్తులున్నాయా?"

"వుండాలి. స్టోర్ రూంలో వుంటాయి."

"ఒకసారి వాటిని వెతికించండి."

"అలాగే.... కాని.... నేను మరల ఇదే ఆర్టిస్టులతో మరో నగరంలో ప్రదర్శనలు యివ్వగలనా!" అడిగాడు ఇల్యానోవ్.

"కరెక్టు.... మీ ఆర్టిస్టులతో నేను స్టాక్ షాట్స్ తీయగలనా?" నివ్వెరపోయాడు శంకరరాజన్.

"సర్కస్ గుడారాలు వెతికించారా? పోయిన వస్తువులు దొరకవచ్చు" అన్నాడు శిరీష్.

"అంగుళం అంగుళం గాలించాం. ఫలితం లేక పోయింది."

శిరీష్ తల విదిలించాడు.

వస్తువులు దొంగిలించింది సర్కస్ మనుషులు!

నార్త్ స్టార్‌ను అపహరించిందీ వాళ్లే!

వాచ్‌మన్‌లను చంపింది వాళ్ళే!!

అయితే వాళ్ళు వస్తువులను దొంగిలించి ఎక్కడ దాచినట్టు? దొంగలు సర్కస్‌ను వదలిపెట్టి వెళ్ళిపోలేదు,

అందుకు సాక్ష్యంగానే ఇంకా దొంగతనాలు జరుగుతోనే వున్నాయి.

7

శంకరరాజన్ స్టూడియోలో ప్రవేశించాడు. స్టోర్ రూంలో అడుగు పెట్టాడు. అసిస్టెంట్ తెల్లమొహంవేసి చూస్తున్నాడు.

"ఫిలింబాక్స్ తీసుకురమ్మంటే ఏం చేస్తున్నావు?" గద్దించాడు శంకరరాజన్.

అసిస్టెంట్ భయపడ్డట్టు చూస్తున్నాడు. "సార్! ఈ అరలోనే ముడి ఫిలిం వున్న బాక్స్ పెట్టాను. కనిపించడం లేదు!" అన్నాడు.

శంకరరాజన్ నుదురు చిట్లించాడు. "ఫిలిం కరగి మాయమయిందా? నాన్సెన్స్! గుర్తు తెచ్చుకో...."

"లేదు సార్! సర్కస్ సీన్స్ షూట్ చేయడానికి కేటాయించిన ఫిలిం ఇక్కడే అరలో వుంచాను!"

"నువ్వు తప్ప ఎవరూ ఈ స్టోర్ రూంలో ప్రవేశించరు!"

"సార్! నా గురించి తమకి బాగా తెలుసు సార్!"

"ఫిలిం ఎంత ఖరీదయిందో తెలుసా?"

"నిజమే సార్! నాదో అనుమానం! సర్కస్‌లో జరుగుతోన్న దొంగతనాల్లాగా మన స్టూడియోలో కూడా...."

"నాన్సెన్స్ .... వాళ్ళ సర్కస్‌లో వాళ్ళు ఏదో ఏడ్చుకుంటారు!"

"వాళ్ళు నటించే సీన్స్ మనం తీస్తున్నాం కదా సార్!"

తేలుకుట్టినవాడల్లే చూశాడు శంకరరాజన్. "అవును.

ఈ సాయంకాలం హిందాలియం సిలిండర్ మీద అజయ్‌విజయ్‌ల ఫీట్స్ తీయాలనుకున్నాను. ఊయలమీది సీన్స్ కూడా ఈ రాత్రికి తీయమన్నాడు ఇల్యనోవ్."

అసిస్టెంట్ మాట్లాడలేదు.

"నయాగరా హోటల్‌కి ఫోన్ చేయి. డిటెక్టివ్ శరీఫ్ ఉన్నారేమో తెలుసుకో" అన్నాడు శంకరరాజన్.

అసిస్టెంట్ బయటికి నడిచాడు.

రెండు నిమిషాలలో తిరిగి గదిలోకి వచ్చాడు.

"ఆయన రష్యన్ సర్కస్ గుడారంలో ఉన్నారట సార్!"

"ఆల్ రైట్! కారు బయలుదేరతీయి!"

వాహిరా స్టూడియో పోర్టికోలోంచి కారు బయలుదేరింది.

సర్కస్ గుడారంలో కలకలంగా వుంది. శంకరరాజన్ అయోమయంగా చూస్తున్నాడు.

శంకరరాజన్ అటుగా పోతోన్న కల్నల్‌ను ఆపాడు.

"సిలిండరుమీద ఫీటు చేస్తాడు....విజయ్ అని అతడి ఇత్తడి బొత్తాలు పోయాయి!" అన్నాడు మరుగుజ్జ కల్నల్.

"ఇత్తడి బొత్తాలా? బంగారపు బొత్తాలు పోయినట్టు" విసుక్కున్నాడు శంకరరాజన్.

"వాటితోనే అతడు సిలిండర్ మీద మూడువందల ప్రదర్శన లిచ్చాడట! ఇకమీదట సర్కస్‌లో పని చేయడట!"

"నిజమా!"

"ఆఁ! లోపలకు రండి. మీకే తెలుస్తుంది" కల్నల్

దారితీశాడు.

ఇల్యానోవ్ గదిలో శిరీష్, హెలీనా విజయ్ వున్నారు. శంకరరాజన్‌ని చూచి ముగ్గురూ విష్ చేశారు. ఇల్యానోవ్ తన తలను పట్టు వేసుకున్నాడు.

"ఈ దొంగతనాలతో ఆయనకి తల వేడెక్కి పోతోంది" అంది హెలీనా.

"హెలీనా! మీరు రండి. స్టోర్ రూంలో కత్తులు వెతుకుదాం!" అన్నాడు శిరీష్.

హెలీనా బయలుదేరింది.

శిరీష్ ఆమె వెనుక స్టోర్ రూంలో ప్రవేశించాడు.

స్టోర్ రూం చిన్న సైజు ప్రపంచంలాగా వుంది. కార్పెట్లూ, నిచ్చెనలూ, ఊయలగా వాడే బొమ్మలూ, బార్, గుండ్రటి రాటలూ, చిరిగిన డేరా గుడ్డలూ, డబ్బాలూ, సీసాలూ....

అక్కడ కాని సామాను అంటూ లేదు.

డేరాకి ప్రక్కగా ఇనుప రేకుల పెట్టెలు ఉన్నాయి. హెలీనా ఆ పెట్టెలను ఎంచుతూ ఒక పెట్టె తెరిచింది. ఆ పెట్టెనిండా డజన్లకొద్దీ కత్తులున్నాయి.

హెలీనా లెక్క పెట్టింది. ఒకటి రెండుసార్లు లెక్క పెట్టాక ఆమె నుదురు ముడతలు పడింది.

"రెండు కత్తులు తక్కువయ్యాయి. నన్ను చెక్కకు ఆన్చి నిలబెట్టే యూసఫ్ కత్తులు విసిరేవాడు. బెంగుళూరులో చచ్చిపోయాడు" అంది హెలీనా.

"రెండు కత్తులు తక్కువయ్యాయి" శిరీష్ గొణిగాడు.

హెలీనాను అడిగి ఒక కత్తి తీసుకున్నాడు.

హెలీనా పెట్టె సర్దింది. అక్కడనుండి కదల బోయింది. నేలమీద ఉబ్బెత్తుగా తగిలింది. కాలు జరిపి

చూసింది.

నేలమీద మట్టి త్రవ్వి కప్పిపెట్టినట్టుగా వుంది.

శిరీష్ ఆమె చూపులు అర్థం చేసుకున్నాడు. దగ్గరలో ఉన్న గునపం అందుకున్నాడు. నేల త్రవ్వసాగాడు. అతడు త్రవ్వుతోండగా అక్కడకు అజయ్, విజయ్, ఇల్యనోవ్, శంకరరాజన్, అతడి అసిస్టెంటూ వచ్చారు.

అందరూ నోరావులించి శిరీష్‌ను చూడసాగారు.

శిరీష్ త్రవ్విన గోతిలోంచి చెక్కపెట్టె బయట పడింది.

"అరె! ఆ పెట్టె నాది!" అరిచాడు ఇల్యనోవ్.

"పెట్టెకు తాళం పెట్టిలేదు" అన్నాడు అజయ్.

డిటెక్టివ్ శిరీష్ పెట్టెమూత ఎత్తిపట్టాడు.

అందరూ తెల్లబోయి చూడసాగారు. పెట్టెలో రకరకాల వస్తువులున్నాయి.

వైట్ హార్స్ బ్రాందీసీసా, ఇత్తడి బటన్సూ హాండ్ స్టిక్, అద్దాలు కుట్టిన జేబు రుమాలు, పాము చర్మంతో కుట్టిన పర్సూ, ముడి ఫిలిం బాక్సూ, దంతంలో చేసిన పైపూ, గ్రుడ్లు పెట్టుకునే ప్లాస్టిక్ బుట్టా పోయిన వస్తువులు అన్నీ వున్నాయి, పాము తప్ప.

హెలీనా పిచ్చెత్తినట్టుగా వస్తువులను తిరగవేస్తోంది.

"స్వీటీ.... నా స్వీటీ...." ఏడుస్తోంది. "అందరికీ పోయిన వస్తువులు దొరికాయి. నాది.... నా ప్రాణం.... నా స్వీటీ...."

నిట్టూర్చి ఒక్కొక్కరు స్టోర్ రూంలోంచి జారుకుంటున్నారు.

శిరీష్ బయటకు వచ్చి నిలబడ్డాడు.

హిండాలియం సిలిండర్ మోసుకుంటూ అజయ్

వెళ్తున్నాడు. విజయ్ సణుగుతూ నడుస్తున్నాడు. సిలిండర్ బరువుకు వంగి కూడా వంగలేనట్టుగా నడుస్తున్నాడు అజయ్.

శిరీష్ కణతలు రుద్దుకున్నాడు.

ఆలోచనలు కొసలు అందినట్టే అంది మాయమవుతోన్నాయి.

హెలీనా అతడిని సమీపించింది.

“అందరివీ అన్ని వస్తువులు దొరికాయి. నా స్వీటీ తప్ప....ప్లీజ్ ....శిరీష్‌గారూ! నేను పిడిగా ఫీజు యిచ్చుకుంటాను. నా స్వీటీని ప్రాణాలతో నాకు ఇవ్వగలరా?”

శిరీష్ ఆమెను జాలిగా చూశాడు.

పాము మాయమై నాలుగు రోజులయింది. దాన్ని ఇంతకాలం ప్రాణాలతో వుంచరు. పైగా మాయమైన వస్తువులు నేలలో కప్పిపెట్టి దొరికాయి. పెట్టెపళంగా ఎక్కడయినా బాహాటంగానే వదలవచ్చును వాళ్ళు. అయినా నేలలో ఎందుకు దాచినట్టు?

నేలలోనే దాచినట్టు తెలిసేలాగా ఎందుకు చేశారు?

పామును కూడా అలాగే భూమి అడుగున....

హెలీనా భుజంమీద చెయ్యివేశాడు శిరీష్. అతడి కళ్ళు ఎర్రబడివున్నాయి.

## 8

ఫోకస్ లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. వాటి కాంతి రింగులో పడుతోంది. అన్ని కోణాల్లోంచి కాంతి పడుతోండటంతో రింగు పట్టపగల్లాగా వుంది.

“ప్రదర్శన అత్యద్భుతంగా వుంది!” అన్నాడు పోలీస్ కమీషనర్. హెలీనా, ఇల్యానోవ్, శిరీష్, పోలీస్ కమీషనర్, ఇతర పోలీస్ వున్నతాధికారులు రింగుకు

దగ్గరగా కూర్చుండి వున్నారు. దాదాపు నాలుగురోజులు డిస్టర్బన్స్ తర్వాత ప్రదర్శన కావడంతో ఆర్టిస్టులలో కొత్త ఉత్సాహం వెల్లుబుకుతోంది.

హారిజాంటల్ బార్ మీద పన్నెండు మంది కళాకారులు ఒకేసారి ఫీట్సు చేశారు.

తర్వాత జంతువులు రావడం మొదలుపెట్టాయి. ఏనుగు కొబ్బరికాయ కొట్టింది. హైందవుల ఆచారంలాగా పూజ చేసింది.

ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు.

గుర్రాలూ, ఒంటెలూ, చారల గాడిదలూ రింగులో తెలివి వున్న మనుషుల మాదిరిగా ప్రవర్తించాయి.

రెండు గుర్రాల మీద ఒక కళాకారిణి స్వారీ చేసింది. ఆమె తలమీద పెట్టుకున్న మంచినీళ్ళ గ్లాసులోంచి ఒక్క నీటిచుక్క కూడా తొణకలేదు.

అజయ్ విజయ్‌లు హిండాలియం సిలిండర్‌ను మోసుకువచ్చారు.

డిటెక్టివ్ శరీష్ సునురు చిట్లించాడు.

ప్రదర్శనలో ఎక్కడో తేడా వుంది. ఏమిటా తేడా?

తాను చాలా సర్కసు బృందాలను చూశాడు. వాటికీ ఈ రష్యన్ సర్కస్ బృందానికీ వున్న తేడా ఏమిటి?

అంత ఎందుకు?

ఇంతవరకూ జరిగిన అద్భుతమైన ఫీట్లు ఒక దారి....

అజయ్ విజయ్‌లు ఒక్కసారిగా హిండాలియం సిలిండర్‌ను నేలమీద పెట్టారు. అభివాదపూర్వకంగా ముందుకు ఒంగారు.

తర్వాత అజయ్‌తో విజయ్ కలసి సిలిండర్ అజయ్

భుజంమీద పెట్టడానికి సహకరించాడు.

ఆరడుగుల ఎత్తులో వున్న సిలిండర్ చిద్విలాసంగా ప్రేక్షకులను పలకరిస్తోంది. ఫోకస్ లైట్ల కాంతి తెల్లటి లోహం మీద పడుతోంది. సిలిండర్ బయట గోడ తళ తళలాడుతోంది.

అజయ్ బాలన్స్ కాచుకుంటూనే మోకాలు వంచాడు.

చెట్టు ఎక్కేవాడల్లే విజయ్ అతడి మోకాలిమీద కాలువేశాడు. రెండో కాలు భుజంమీద వేసి మొదటి కాలు తీసి గాల్లో ఉంచాడు. తర్వాత గాల్లో ఉంచిన కాలు అజయ్ తలమీద పెట్టాడు.

అజయ్ తన రెండు చేతులతో సిలిండర్‌ను పట్టుకున్నాడు.

విజయ్ ఒడుపుగా సిలిండర్‌ను పట్టుకున్నాడు. పైకి జంప్ చేశాడు. ప్రేక్షకులు కళ్ళుమూసి తెరిచేలోగా విజయ్ సిలిండర్ మీద నిలబడ్డాడు. అజయ్ నిశ్చింతగా బాలెన్స్ కాచుకుంటున్నాడు. నాలుగు అంగుళాలు వ్యాసం వున్న సిలిండర్! ప్రేక్షకులు ఊపిరి బిగబెట్టి చూస్తున్నారు.

విజయ్ మెల్లగా వొంగాడు. ప్రతి కదలికలోనూ గరిమనాభి తిన్నగా సిలిండర్ నిలువు కోతకు మధ్యగా పడేలాగా జాగ్రత్తపడుతున్నాడు.

సిలిండర్‌ను రెండు చేతులతో వదలి కాళ్ళతో లంకె వేశాడు విజయ్. నిరాధారంగా దానికి వ్రేలాడుతున్నాడు.

సిలిండర్‌నూ, విజయ్‌నూ చూస్తో అటూ ఇటూ అడుగులు వేస్తున్నాడు అజయ్.

విజయ్ తలక్రిందులుగా సిలిండర్ మీద ప్రాకుతున్నాడు.

"హెలీనా!" పిలిచాడు శిరీష్.

హెలీనా తలెత్తి చూసింది.

అజయ్ రింగులో చుట్టూ తిరుగుతోన్నాడు.

"నువ్వు ఆట చూడటం లేదా?"

"లేదు!"

"స్వీటీ ఎంత లావు ఉంటుంది?"

"పొడవు అయిదడుగుల పదకొండంగుళాలు. పొట్ట దగ్గర అడ్డ కొలత మూడున్నర అంగుళాలు!"

"రోజుకు ఎన్ని గ్రుడ్లు తినేది."

"పదిహేనూ—ఇరవై."

"తర్వాత గ్రుడ్లు మాయమవడం జరిగిందా?"

"లేదు!"

"స్వీటీకి ఏమైందో....కాని ఏం జరిగినా సహించగలవా?"

హెలీనా చిగురుటాకులాగా వణుకుతోంది.

"ఏమయింది?" అడిగింది.

"అఁ!" కవ్వుమన్నాడు విజయ్.

శిరీష్ తలెత్తి చూశాడు. సిలిండర్ మీద విజయ్ పట్టు సడలింది. తలక్రిందులుగా జారి అజయ్ మీద పడ్డాడు. బుర్రలు రెండూ ఖంగుమన్నాయి. విజయ్ క్రిందకు జారాడు.

బ్యాలెన్స్ తప్పింది సిలిండర్. గాల్లోకి వాలింది.

"దఢ్ ఢ్ ...."

శిరీష్ మస్తిష్కంమీద విద్యుద్ఘాతంలాగా తగిలింది.

సిలిండర్ దఢ్ ఢ్ మంటోంది. ఎందుకు?

డిటెక్టివ్ శిరీష్ చటుక్కున రింగులోకి దూకాడు.

విజయ్ క్రిందపడ్డవాడు చటుక్కున లేచాడు. సిలిండర్ ఈడ్చుతూ లోపలకు పరుగెత్తబోయాడు. అజయ్ లేచి సిలిండర్ రెండో చివర పట్టుకోబోయాడు.

శిరీష్ ఎగిరి అజయ్ డొక్కలో తన్నాడు.

అజయ్ ఎగిరి అవతలకు పడ్డాడు.

విజయ్ వెనక్కి చూడదల్చుకోలేదు.

ప్రేక్షకులు హాహాకారాలు చేస్తున్నారు.

శిరీష్ పరుగెత్తుకు వెళ్ళి విజయ్‌ను మెడ ఒడిసి పట్టుకున్నాడు. అప్పటికి అజయ్ లేచి శిరీష్ మీదకు దూకాడు.

పోలీస్ కమీషనర్, ఇల్యానోవ్ రింగులోకి వెళ్ళారు. బాలన్ విజిల్ ఊదాడు. పోలీసులు రింగులోకి పరుగెత్తారు.

అప్పటికి శిరీష్ వాళ్ళిద్దరినీ మెడలు వొంచి తలలు ఢీ కొట్టాడు.

ఇద్దరూ నేలమీద కూర్చుండిపోయారు.

రింగులో సిలిండర్ దొర్లుతోంది.

"వాచ్‌మన్‌లను చంపింది వీళ్ళే!" అరిచాడు శిరీష్.

ఇల్యానోవ్ నిర్ఘాంతపోయాడు.

"అయితే నార్త్ స్టార్ వీళ్ళ దగ్గరే దొరకాలి!" పోలీస్ కమీషనర్ వాళ్ళను సమీపించాడు.

# 9

రింగులో ఏం జరుగుతోందో ప్రేక్షకులకు అంతు పట్టడం లేదు.

డిటెక్టివ్ శిరీష్ సిలిండర్‌ను సమీపించాడు. రెండు చేతులతో ఎత్తాడు.

"హిండాలియం సిలిండర్! అది అంత బరువు ఉండ కూడదు!" అరిచాడు ఇల్యానోవ్.

ప్రేక్షకులు గ్యాలరీలోంచి లేవసాగారు. అలజడిగా దిగుతున్నారు.

పోలీస్ కమీషనర్ పిస్తోలు తీశాడు. గాల్లోకి పేల్చాడు. ఎక్కడి ప్రేక్షకులు అక్కడ బిర్ర బిగుసుకు పోయారు. అందరినీ నిశ్శబ్దంగా కూర్చోమని ఆజ్ఞా పించాడు.

రింగులో చెడు వాసనా, కర్పూరపు వుండల వాసనా వ్యాపించాయి.

శిరీష్ సిలిండర్‌ను మధ్యలో పట్టుకుని ఏటవాలుగా పెట్టాడు. సిలిండర్ లోంచి మెల్లగా పాము వస్తోంది.

"స్వీటీ...." అరుస్తోంది హెలీనా.

ఆమె పరుగెత్తుకు వచ్చేసరికి పాము శరీరం రింగులో వుంది. శవం ఎక్కడపడితే అక్కడ చెడిపోయివుంది.

"మై గుడ్ నెస్! పామును సిలిండర్ లో దాచారు."

అజయ్ విజయ్‌లకు కలిపి అరదండాలు తొడిగాడు పోలీస్ కమీషనర్.

"నారు స్టార్ వజ్రం ఎక్కడ దాచార్రా రాస్కెల్స్!" పోలీస్ కమీషనర్ తమిళంలో తిడు తోన్నాడు.

శిరీష్ ఆయన వైపు నవ్వుతో చూశాడు.

"నేను చెబుతాను!" అన్నాడు శిరీష్.

బలంగా శ్వాస పీల్చుకుని, "పాములకు అమోఘమైన జీర్ణశక్తి ఉంటుంది. ఆ విషయం వీళ్ళు తెలుసుకున్నారు. సర్కస్ కత్తులు సంపాదించారు. మ్యూజియంలో నారు స్టార్‌ను దొంగిలించాలనుకున్నారు. వాచ్‌మన్‌లను

చంపారు.

వాళ్ళ శవాలు పడివున్న తీరూ, బలమైన గాయాలు తగిలిన తీరూ విడ్డూరంగా వున్నాయి. అంత నేర్పుగా ఆయుధాలను ప్రయోగించాలంటే ఏళ్ళ తరబడి సాధన వున్నవాళ్ళు కావాలి. తాళాలు పగలగొట్టడం, ఎలక్ట్రికల్ అలారం మోగకుండా చేయడం, రెండో అంత స్తుకి చేరుకోవడం—యివన్నీ అతి లాఘవంగా చేసిన పనులు!

టాక్సీడ్రయివర్‌తో బాటు నేను ప్రమాద స్థలాన్ని చూశాను. సందు చివర గుడ్డముక్కమీద రక్తంచుక్కలు దొరికాయి. అది మనిషి రక్తమే అని తర్వాత పరిశోధనలో తెలిసింది. చనిపోయిన వాచ్‌మన్‌ల రక్తంతో పోల్చితే ఒక హతుడి రక్తం గ్రూపుతో సరిపోతుంది.

అంటే హంతకులు ఆ సందులోంచే పారిపోయారు. వాళ్ళ వెనక భాగాలు మాత్రమే టాక్సీడ్రయివర్ చూడగలిగాడు.

సర్కస్ ట్రూపులో వింత దొంగతనాలు ప్రారంభమయాయి. వస్తువులన్నిటినీ జాబితా వేశాను.

| | |
|---|---|
| హెలీనా | —స్వీటీ అనే పాము, గుడ్లు, తొట్టె. |
| ఇల్యానోవ్ | —దంతం వెపు. |
| ఫెర్డినాండ్ | —వైట్‌హార్స్ విస్కీ. |
| విజయ్, అజయ్ | —ఒక్కడివే ఇత్తడి బొత్తాలు. |
| కల్నల్ | —హాండ్‌స్టిక్. |
| జాఫర్ | —జేబురుమాలు |
| ఫరీదున్నిసా | —పాముతోలుతో చేసిన మనీపర్స్. |
| శంకరరాజన్ | —ఖుడి ఫిలింబాక్స్. |
| మ్యాజియం | —నార్త్ స్టార్. |

వీటితో దేనికీ సంబంధం లేదనుకున్నాను మొదట. కాని సర్కస్‌వాళ్లే ఎవరో వాచ్‌మన్‌లను హత్య చేసినట్టు అనుమానం వచ్చాక నా ఉద్దేశ్యంలో మార్పు వచ్చింది. నార్త్ స్టార్ వజ్రం దొంగతనం బయటపడకుండా పనికిమాలిన దొంగతనాలు చేశారు. వీటన్నింటిలోనూ పనికివచ్చే దొంగతనం స్వీటిని ఎత్తుకుపోవడం ఒక్కటే...." శిరీష్ ఆగాడు.

హెలీనా పాము దగ్గర కూలబడింది.

శిరీష్ ఆమెను చురుకుగా చూశాడు.

"పాముతోబాటు గ్రుడ్లు ఎత్తుకుపోయారు దొంగలు. ఎందుకు? పాముమీద దయతలచి కాదు. నార్త్‌స్టార్‌ను ఒక గ్రుడ్డులో జొనిపారు. ఉడికిన గ్రుడ్డు! దాన్ని పాము చేత మింగించారు. పామును ఎక్కడ దాచాలి? ఎక్కడ దాచినా దొరికిపోతారు. హెలీనా పిచ్చెత్తినట్టు పాము కోసం వెతుకులోంది కదా!

తాము రోజూ ట్రిక్ చేసే హిండాలియం సిలిండర్‌లో దాచారు. మూతపెట్టారు. పాము ఉక్కిరిబిక్కిరయింది. చనిపోయింది. అందుకే యిద్దరూ నెర్వస్‌గా ఫీలవుతూ వచ్చారు. చివరకు వాళ్ళు పోగొట్టుకున్న ఇత్తడి బటన్స్ దొరికిప్పటికీ వాళ్ళకు నెర్వస్‌నెస్ తగ్గలేదు. అంటే వాళ్ళ నెర్వస్‌నెస్‌కి ఇత్తడి బటన్స్ పోవడం కారణం కాదు.

మరో విచిత్రం!

హిండాలియం సిలిండర్ మొట్టమొదటిసారిగా నేల మీద పడింది. దడ్ డ్ మంటూ శబ్దం చేసింది. ఖాళీ సిలిండర్ గుల్లగా శబ్దం చేయాలి. పైగా వాళ్ళ ఫీట్ ఫెయిలు కావడానికి అప్పటికింకా వాళ్ళకి సంబంధించిన

'అచ్చి వచ్చిన వస్తువులు' ఏమీ పోలేదు. వాళ్ళు సిలిండర్ ను వదలి ఒక్క క్షణం కూడా వుండటంలేదు. అంతే కాదు!

సర్కస్ లో ఫీట్ చేసినవాళ్ళు వస్తువును అక్కడే వుంచి వెళ్ళిపోతారు. అజయ్ విజయ్ మాత్రం వాళ్ళ సిలిండర్ ను వాళ్ళే మోసుకుపోతున్నారు. ఒక్కడు మోసుకు వెళ్ళగలిగిన సిలిండర్ ను యిద్దరు కలిసి ఎందుకు మోసుకుపోతున్నారు?

ఏటవాలు పొజిషన్ లో పాము బరువైన శరీరం మూత తొలగించుకుని బయటపడుతుందేమో! అందుకే ట్రిక్ చేసేటప్పుడు మూసిన భాగం క్రిందకూ మూతవున్న భాగం పైకీ వచ్చేలాగా జాగ్రత్తపడుతున్నారు.

అంటే వజ్రాన్ని బయటకు తీయగలిగి కూడా ఎందుకు తీయలేకపోతున్నారు!

వజ్రాన్ని వాళ్ళు తమకోసం దొంగిలించలేదు.

దొంగిలించమని పురమాయించిన వ్యక్తి యింతవరకూ రాలేదు.

ఫిలిం పోయిన రోజునే అజయ్ విజయ్ షూటింగులో పాల్గొన్నారు. స్టూడియోకి వచ్చారు. పనిలో పనిగా ముడిఫిలిం దొంగిలించారు.

ఈ కేసులో అనవసరమయిన పాత్రలు చాలా వున్నాయి.

వాళ్ళను అనుమానించవలసిన సంఘటనలు చాలా జరిగాయి.

ముఖ్యంగా ఫరీదున్నీసా బాలెన్స్ తప్పడం!

ఆమె గొడుగును కావాలనే దొంగలలో ఒకడు పాడుచేశాడు. అనుమానం ఫెర్డినాండ్ మీదకు వెళ్ళాలని

కాబోలు!

నేను అందరినీ యించుమించుగా వెంటాడాను. దొంగలు యిద్దరూ గుడారంలో నే ప్రాక్టీసు చేసుకుంటూ మిగిలిపోయేవారు!"

ఆగాడు శిరీష్.

పోలీస్ కమీషనర్ శిరీష్‌ను అభినందనపూర్వకంగా చూశాడు.

ఇల్యానోవ్ దొంగలవైపూ, శిరీష్ వైపూ మార్చి మార్చి చూశాడు. పామును కట్ చేయించాడు.

"స్వీటీ....స్వీటీ.... ..." హెలీనా పిచ్చిగా అరుస్తోంది.

ఛిద్రమైన పాము శరీరం మధ్య గ్రుడ్లూ.... దాని చీలికలో నాలుగు స్టార్....

——:ఐ పో యిం ది:——